క్లుప్తంగా

వైభవంగా శత సహస్ర లక్ష్మీగణపతి హోమం

విజయవాడ కల్చరల్: శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి ఆదేశంతో లోక కల్యాణార్థం శివరామకృష్ణ క్షేత్రంలో 24 రోజులుగా నిర్వహిస్తున్న శత సహస్ర(లక్ష) లక్ష్మీగణపతి పూజ ముగింపు దశకు చేరుకుంది. శనివారం నాటి కార్యక్రమంలో శృంగేరీ క్షేత్రం నుంచి వచ్చిన వేద పండితులు గణపతి పూజ, గణపతి అధర్వశీర్షోపనిషత్ పారాయణ, సహస్ర నామార్చన కార్యక్రమంతో పాటు లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. క్షేత్ర ధర్మాధికారి శిష్ట్లా హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ 29 వ తేదీ ఆదివారంతో హవన కార్యక్రమం ముగుస్తుందని తెలిపారు.

డెప్యూటీ ఈవోగా బాధ్యతలు స్వీకరించిన రత్నరాజు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి డెప్యూటీ ఈవోగా రత్నరాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. దేవదాయ శాఖ డెప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న రత్నరాజు దుర్గ గుడి డెప్యూటీ ఈవోగా బదిలీపై వచ్చారు. ప్రస్తుతం దుర్గగుడి డెప్యూటీ ఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న లీలాకుమార్‌ను పెదకాకాని ఆలయానికి ఈవోగా బదిలీ చేశారు.

దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన హంసధ్వని కూచిపూడి నృత్యాలయానికి చెందిన కళాకారులు శనివారం నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై సీహెచ్ అజయ్‌కుమార్ సారథ్యంలో శిష్యబృందం పలు కీర్తనలకు కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు. అనంతరం కళాకారులకు దేవస్థాన అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.

వృద్ధులు, వికలాంగులకు స్టేర్‌లిఫ్ట్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ దర్శనానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో స్టేర్‌లిఫ్ట్‌ను దేవస్థానం ఏర్పాటు చేసింది. దుర్గ గుడి ఘాట్‌రోడ్డు మీదుగా వచ్చే భక్తులు అమ్మవారిని దర్శించుకోవాలంటే మెట్లపై నుంచి కిందకు దిగడం తప్పని సరి. వృద్ధులు, వికలాంగులు పడుతున్న ఇబ్బందుల పరిష్కారానికి చిన్న గాలిగోపురం నుంచి స్కానింగ్ పాయింట్ వరకు ఈ స్టేర్‌లిఫ్ట్‌ను ఏర్పాటు చేసింది. సుమారు వంద కేజీల వరకు బరువు మోయగలిగేలా ఈ లిఫ్ట్‌ను ఏర్పాటు చేశారు. శనివారం లిఫ్ట్ ఏర్పాటు పనులు పూర్తికాగా, ప్రయోగాత్మకంగా పరిశీలించారు. దసరా ఉత్సవాల్లో ఈ లిఫ్ట్ వినియోగంలోకి తీసుకువచ్చే అవకాశాలను దేవస్థాన ఇంజినీరింగ్ విభాగం పరిశీలిస్తోంది.

నిత్యాన్నదానంకు రూ.లక్ష విరాళం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రా షిరిడీ ముత్యాలంపాడు శ్రీషిరిడీ సాయిబాబా మందిరంలో నిత్యాన్నదానంకు శనివారం అయోధ్యనగర్ లోటస్ ల్యాండ్‌మార్క్‌కు చెందిన దాత పి.లెనిన్, రమాదేవి దంపతులు రూ.లక్షా వెయ్యినూట పదహార్లను మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ బుడమేరు వరద సమయంలో వరద బాధితులకు బాబా మందిరం ద్వారా అందించిన సేవలు, అన్నదానం తమను ఆకట్టుకున్నాయన్నారు.అనంతరం బాబావారి శేష వస్త్రం, చిత్రపటంతో దాతలను సత్కరించారు. కార్యక్రమంలో మందిర కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

కవి జాషువాకు నృత్యనీరాజనం



విజయవాడ కల్చరల్: విశ్వనరుడు కవి కోకిల గుర్రం జాషువా 129వ జయంతి సందర్భంగా జాషువా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో బందరురోడ్డులోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో శనివారం వినూత్నంగా నగరానికి చెందిన పలువురు నాట్యాచార్యులు నృత్య నీరాజనం అందించారు. వివిధ అంశాలపై పిళ్ళా ఉమామహేశ్వర పాత్రుడు, సప్పా శివకుమార్ బృందం, గోనుగుంట్ల శైలశ్రీ,మాగులూరి త్రినాథాచారి, యల్లా జోస్యుల అనూరాధ, పద్మశ్రీ హేమంత్ నృత్యాలను ప్రదర్శించారు. సభకు కవి అనిల్ డ్యానీ అధ్యక్షత వహించారు. అప్పాజోస్యుల విష్ణుభొట్ల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అప్పాజోస్యుల సత్యనారాయణ, కవి పరిశోధకుడు డాక్టర్ గుమ్మా సాంబశివరావు, ఎంబీకే బాధ్యుడు మురళీకృష్ణ , గుండు నారాయణ, గోళ్ళ నారాయణరావు పాల్గొన్నారు.

మతం పేరుతో రాజకీయం చేస్తున్న చంద్రబాబు

- ఆయన చేసిన పాపాలు ప్రజలకు తగలకూడదనే పూజలు
- దాసాంజనేయునికి పూజలు చేసిన మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



సత్యనారాయణపురం దాసాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): చంద్రబాబు తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం మతాలు, దేవుడిని కూడా రాజకీయం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ సెంట్రల్ సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆరోపించారు. తిరుమల పవిత్రతను మంటగలిపిన చంద్రబాబు చేసిన పాపానికి ప్రక్షాళనగా సత్యనారాయణపురంలోని దాసాంజనేయస్వామి ఆలయంలో శనివారం విష్ణు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో జరిగిన అపచారాలు, అరిష్టాలు అన్నీ ఇన్నీ కావని విమర్శించారు. ముఖ్యంగా తిరుమల లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు దుర్మార్గపు ప్రచారం చేశారని, ఆయన చేసిన పాపాలు ఈ రాష్ట్రానికి, ప్రజలకు తగలకూడదనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాలలో పూజలకు తమ పార్టీ అధిష్టానం పిలుపునిచ్చినట్లు తెలిపారు. చంద్రబాబు చెబుతున్న నెయ్యిని అసలు వాడనేలేదని, అలాంటప్పుడు లడ్డూ ఏ విధంగా కల్తీ అవుతుందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ట్యాంకర్లను వెనక్కు పంపించామని ఈవో శ్యామలరావు స్పష్టంగా చెప్పినా బాబు మాత్రం రాజకీయ రంగు పులిమి రాద్ధాంతం చేస్తున్నారని ఆరోపించారు. నెయ్యి శ్యాంపిల్స్‌ను సాధారణంగా పరీక్ష కోసం మైసూర్‌లోని సీఎఫ్‌టీఆర్‌ఐ (సెంట్రల్ ఫుడ్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్)కు పంపిస్తారని, కానీ తొలిసారి గుజరాత్‌లోని ఎన్‌డీడీబీ (నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్)కి పంపడం వెనుక దాగున్న కుట్ర కోణమేమిటని ప్రశ్నించారు. ఇలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడిగిన ఏ ఒక్క ప్రశ్నకు ఈ ప్రభుత్వం వద్ద సమాధానం లేకపోవడంతో డిక్లరేషన్ పేరుతో డైవర్షన్ పాలిటిక్స్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరునామాలు ధరించి ఎవరైతే భక్తి శ్రద్ధలతో స్వామి వారి కైంకర్యాలు, దర్శనానికి వస్తారో వారంతా శ్రీవారి భక్తులేనని భగవత్ శ్రీ రామానుజాచార్యులు చెప్పిన మాటలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. కొండమెట్లు ఎక్కేటప్పుడు గానీ, దర్శనానికి ముందుగానే ఎవరైతే శ్రీవారి తిరునామం ధరించి ఉంటారో వారంతా స్వామివారి విశ్వాసపాత్రులేనని ఆలయ ప్రామాణిక సూత్రాల్లో భగవద్రామానుజుడు స్వయంగా పొందుపరిచారన్నారు. అనుమానాలుంటే తిరుమల తిరుపతి దేవస్థానం శాసనాలను ఒక్కసారి చదవాలని పచ్చ నేతలకు సూచించారు.

వైఎస్ జగన్ తిరుపతి వెళ్తుంటే ఎందుకంత భయం?

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీవారిని దర్శించుకోవడానికి పోలీసుల అనుమతి కావాలా అని మల్లాది విష్ణు ప్రశ్నించారు. ఆయన మొదటిసారి తిరుమలకు వెళ్లడం లేదని, పాదయాత్రకు ముందు కూడా వెళ్లారని గుర్తుచేశారు. సీఎం హోదాలో శ్రీవారికి పట్టు వస్త్రాలు కూడా సమర్పించారని చెప్పారు. అయినా ఆంక్షల పేరిట పోలీసులు అడ్డుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు దొంగ స్వాములతో ధర్నాలు చేయించే స్థాయికి ఈ ప్రభుత్వం దిగజారిందని ధ్వజమెత్తారు.

హిందూ ధర్మం గూర్చి మాట్లాడే అర్హత బాబుకి లేదు...

కాలికి బూట్లతో పూజలు, దుర్గమ్మ ఆలయంలో తాంత్రిక పూజలు చేసిన చంద్రబాబు పరమ భక్తుడా అని మల్లాది విష్ణు ప్రశ్నించారు. గత పుష్కరాల సమయంలో హిందూ దేవాలయాలను కూల్చివేసి చెత్త తరలించే వాహనాలలో దేవతామూర్తుల విగ్రహాలను తీసుకెళ్లింది మీ హయాంలో కాదా అని ప్రశ్నించారు. బాబు ప్రచార పిచ్చికి పుష్కరాలలో 30 మంది అమాయకులు చనిపోయారని, అయినా కనీసం పరామర్శించిన పాపాన పోలేదన్నారు. హిందూ ధర్మం గూర్చి మాట్లాడే నైతిక అర్హత బాబుకి ఏ మాత్రం లేదన్నారు.

అమిత్ షా కుటుంబంపై దాడిని మరిచారా?

బాబు అధికారంలో ఉండగా తిరుపతిలో 2018, మే 11న అమిత్ షా పై జరిగిన దాడిని బీజేపీ నేతలు మరిచారా అని మల్లాది విష్ణు ప్రశ్నించారు. కుటుంబ సమేతంగా శ్రీవారి దర్శనానికి వచ్చిన అమిత్ షా కాన్వాయ్‌ను వెంబడించి మరీ ఆనాడు తిరుపతిలో టీడీపీ శ్రేణులు కర్రలు, రాళ్లతో దాడికి తెగబడింది నిజమో కాదో బీజేపీ నాయకులు ఒక్కసారి గతం గుర్తుచేసుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీకి 40 శాతం ఓటు బ్యాంకు ఉందన్న భయం చంద్రబాబును వెంటాడుతోందని, అందుకే జగన్‌ను, గత ప్రభుత్వాన్ని అభాసుపాలు చేయాలనే ప్రయత్నంలో చివరకు వారే దోషులుగా నిలబడ్డారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు శర్వాణీమూర్తి, అలంపూర్ విజయలక్ష్మి, డివిజన్ ఇన్‌చార్జిలు, కోఆర్డినేటర్లు, భక్తులు పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసరాల పంపిణీ



భవానీపురం(విజయవాడపశ్చిమ): బుడమేరు వరద ప్రభావిత ప్రాంతమైన జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో ముంపునకు గురైన అసంఘటిత కార్మికులకు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ (డీబీఆర్‌సీ) ఆధ్వర్యంలో శనివారం నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీబీఆర్‌సీ సీఇఓ అల్లాడి దేవకుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శామ్యూల్ అనిల్ కుమార్ మాట్లాడుతూ బతుకు తెరువు కోసం పొట్ట చేతబట్టుకుని వేర్వేరు రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న అసంఘటిత కార్మికులను వరద నిండా ముంచేయడం బాధాకరమని అన్నారు. వైఎస్సార్ కాలనీలో 100 కుటుంబాలు, పి.నైనవరంలో 60 కుటుంబాలు, కొత్తూరు తాడేపల్లి వేమవరంలో 40 కుటుంబాల కార్మికులకు నిత్యావసర సరకులతో కూడిన కిట్లను పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో డీబీఆర్‌సీ వైఎస్సార్ కాలనీ కో ఆర్డినేటర్ మల్లేశ్వరి, టీఎల్ రాజు, రమ, ఇండియన్ లేబర్ లైన్ సభ్యులు పాల్గొన్నారు. దాతలు అందించిన సాయానికి కార్మికులు కృతజ్ఞతలు తెలుపుతూ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

2030 నాటికి రేబిస్ వ్యాధి నిర్మూలనకు కృషి

- పెంపుడు జంతువులకు విధిగా వ్యాక్సిన్ వేయించాలి
- ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు



పెంపుడు జంతువులకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా

మధురానగర్(విజయవాడసెంట్రల్): రేబిస్ వ్యాప్తిని నిరోధించి 2030 నాటికి రేబిస్ వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు సమన్వయంతో కృషి చేయాలని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సూచించారు. ప్రపంచ రేబిస్ దినోత్సవం పురస్కరించుకుని శనివారం 'బ్రేకింగ్ రేబీస్ బౌండరీస్' అనే నినాదంతో జిల్లా పశుసంవర్ధక శాఖ, వైద్య ఆరోగ్యశాఖ సంయుక్త ఆధ్వర్యంలో పెంపుడు జంతువులకు వాక్సినేషన్ కార్యక్రమం ముత్యాలంపాడు పశువైద్యశాలలో శనివారం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేబిస్ వ్యాధి వ్యాప్తి, లక్షణాలు, నివారణ, వ్యాధి తీవ్రత గురించి ప్రజలలో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి పెంపుడు జంతువులకు వ్యాక్సినేషన్ విధిగా చేయించాలని, పెంపుడు జంతువులకు దగ్గరగా ఉండేవారు ప్రోపెలాక్సిస్ వ్యాక్సినేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. జంతువుల కాటుకు గురయిన వారు రేబిస్ వ్యాక్సిన్ వైద్యులు నిర్ణయించిన ప్రకారం అన్ని డోసులు తప్పనిసరిగా వేయించుకోవాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ హనుమంతరావు రేబిస్ వ్యాధి ప్రాముఖ్యత, నివారణ పద్ధతుల గురించి వివరించారు. అనంతరం పెంపుడు జంతువులకు రేబిస్ వ్యాక్సిన్ వేశారు. తొలుత లూయిస్ పాశ్చర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం సుమారు 300 పెంపుడు జంతువులకు వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ అధికారి డాక్టర్ జూపూడి ఉషారాణి, డాక్టర్ గోపీచంద్, డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఇందుమతి, డాక్టర్ మాధవి నాయుడు, పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రాజశేఖర్, పశువైద్యులు హరీష్, రామకృష్ణ, వీఎల్‌ఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఛాయా చిత్రకారుడు శ్రీనివాసరెడ్డికి ప్రతిష్టాత్మక పురస్కారం



రాజ్యలలితా అకాడమీ పురస్కారం అందుకుంటున్న శ్రీనివాసరెడ్డి

విజయవాడ కల్చరల్: నగరానికి చెందిన అంతర్జాతీయ ఫొటో తమ్మా శ్రీనివాసరెడ్డికి అత్యంత ప్రతిష్టాకరమైన రాజ్యలలితా అకాడమీ పురస్కారం లభించింది. శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. భారత ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల మంత్రిత్వ శాఖ లలిత కళా అకాడమీ ప్రతి ఏటా జాతీయ స్థాయిలో ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహిస్తుంది. నగరానికి చెందిన శ్రీనివాసరెడ్డి కేరళలోని తియ్యం నృత్యంపై తీసిన చిత్రాన్ని న్యాయనిర్ణేతలు ఉత్తమమైనదిగా గుర్తించారు. ఉత్తర ప్రదేశ్ మంత్రి లాలాజీ నిర్మల్ చేతులమీదుగా శుక్రవారం శ్రీనివాసరెడ్డి ఈ పురస్కారం అందుకున్నారు. గతంలో శ్రీనివాసరెడ్డి తీసిన పలు చిత్రాలకు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు లభించాయి. ఈ సందర్భంగా నగరానికి చెందిన కళాపోషకుడు గోళ్ల నారాయణరావుతో పాటు పలు కళా సంస్థలు శ్రీనివాసరెడ్డిని అభినందించాయి.

మొక్కలను పెంచటం అలవాటుగా చేసుకోవాలి

సీడ్ బాల్స్‌ను తయారు చేసిన విద్యార్థులు



సీడ్ బాల్స్‌ను తయారు చేస్తున్న అజయ్ హైస్కూల్ విద్యార్థులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థి దశ నుంచే మొక్కలను పెంచటం అలవాటుగా చేసుకోవాలని అజయ్ హైస్కూల్ డైరెక్టర్ ఏపుగంటి సాయికృష్ణ అన్నారు. స్థానిక ముత్యాలంపాడు అజయ్ హైస్కూలులో శనివారం వాసవీ క్లబ్ ఆధ్వర్యాన సీడ్ బాల్స్ తయారీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మొక్కల ప్రాధాన్యతను తెలియ జేసేందుకు తాము విద్యార్థులతో సీడ్‌బాల్స్ తయారు చేయిస్తున్నామన్నారు. ఇక్కడ తయారు చేసిన సీడ్ బాల్స్‌ను హైవేస్, అవసరమైన ప్రాంతాలలో వేస్తామని తెలిపారు. సీడ్ బాల్స్ తయారీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

● వినాయక నిమజ్జనం

విద్యాధరపురంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన 72 అడుగుల మట్టి వినాయక విగ్రహ నిమజ్జన కార్యక్రమం శనివారం కోలాహలంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నృత్యాలు, కేరింతలతో సందడి చేశారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

డీఈవో సుబ్బారావు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు వక్తృత్వం, క్విజ్ వంటి అంశాల్లో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎన్టీఆర్ జిల్లా పాఠశాల విద్యాశాఖ జిల్లా అధికారి యువీ సుబ్బారావు అన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర -2047 పేరుతో జిల్లా స్థాయిలో వక్తృత్వం, క్విజ్ తదితర పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో కార్యాలయంలో శనివారం బహుమతి ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఈవో సుబ్బారావు విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆదిత్య విద్యార్థుల చేయూత



పటమట(విజయవాడ తూర్పు): ఇటీవల నగరాన్ని కుదిపేసిన వరదతో సమస్తం కోల్పోయిన వరద బాధితులను ఆదుకునేందుకు పటమట ఆదిత్య కాలేజీ విద్యార్థులు ముందుకు వచ్చారు. కళాశాల విద్యార్థులు శనివారం బాధితులకు నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వీర్రాజు మాట్లాడుతూ.. నగరంలో బుడమేరు విపత్తుతో తీవ్రమైన నష్టం కలిగిందన్నారు. చాలా కుటుంబాల్లో విషాదం నింపిందని, వారిని ఆదుకునేందుకు ఆదిత్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ సుగుణరెడ్డి పిలుపు మేరకు తమ విద్యాసంస్థలు ముందుకొచ్చి మేము సైతం అంటూ విద్యార్థులు తమ వంతు సహాయంగా బియ్యం , నిత్యావసర వస్తువులు సాయం అందించామన్నారు. వరద సహాయాన్ని శనివారం సింగ్‌నగర్, పాయకాపురం ప్రాంతాల్లో బాధితులకు అందజేశామని చెప్పారు.

ఫీవర్ సర్వే

మధురానగర్(విజయవాడసెంట్రల్): 30వ డివిజన్ దావు బుచ్చయ్యకాలనీలో శనివారం ఫీవర్ సర్వే జరిగింది. ఆరోగ్యకేంద్రం సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జ్వరాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జ్వరాలు ఉన్నవారికి పారాసెటమాల్ ట్యాబెట్లు ఇచ్చారు. ఖాళీ ప్రదేశాలు, నీటి నిల్వ ప్రాంతాలలో ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేశారు.

అలరించిన కోలాటం

సిద్ధార్థలో ఉత్సాహంగా సాగిన దసరా సాంస్కృతికోత్సవాలు



సిద్ధార్థ ఆడిటోరియంలో కోలాటం ఆడుతున్న మహిళలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం, వివిధ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో దసరా సాంస్కృతికోత్సవాల్లో భాగంగా శనివారం ప్రదర్శించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థినులతో పాటుగా మహిళలు కూడా పాల్గొని కోలాటాన్ని ప్రదర్శించి అలరించారు. దసరా సందర్భంగా నిర్వహిస్తున్న ఉత్సవాలు కావడంతో దుర్గమ్మను కీర్తిస్తూ పాటలు పాడుతూ కోలాటాన్ని ప్రదర్శించారు. సాయంత్రం జరిగిన ఉత్సవాల ముగింపు సభకు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉత్సవాల నిర్వాహకులు విజయలక్ష్మి, కల్పన, జ్యోత్స్న, శారద, పి.మురళీకృష్ణ, జి.వాణి తదితరులు పాల్గొన్నారు.

చైతన్య స్ఫూర్తి భగత్ సింగ్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): భారత స్వాతంత్ర్యోద్యమంలో భగత్ సింగ్ చరిత్ర ఆద్యంతం చైతన్య స్ఫూర్తిదాయకమని ప్రముఖ సామాజికవేత్త, వేముల చారిటీస్ చైర్మన్ వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. భగత్‌సింగ్ 117వ జయంతి కార్యక్రమం సింగ్‌నగర్ ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో శనివారం ఘనంగా జరిగింది. ముందుగా యునైటెడ్ ఎస్‌జీఓ అసోసియేషన్ అధ్యక్షుడు రాంబాబు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి భగత్‌సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. డీవైఎఫ్‌ఐ నగర కార్యదర్శి షేక్ నిజాముద్దీన్, స్కూల్ ఇన్‌చార్జ్ దేవరపల్లి మనోహర్, పింగళి వెంకయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి గాయత్రి దేవి, డీవీఆర్‌డి సత్యనారాయణ, నాగరాజు, అంజిబాబు, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాంబేకాలనీలో...

సర్దార్ భగత్ సింగ్ జయంతి కార్యక్రమం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో వాంబే కాలనీలో జరిగింది. ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి లంకా గోవిందరాజులు ముఖ్యఅతిథిగా విచ్చేసి భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కె.కార్తీక్, సింహాచలం, ఆసిఫ్, భువనేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సింగ్‌నగర్ కృష్ణాహోటల్ సెంటర్‌లో...

సీపీఐ 58వ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతి కార్యక్రమం సింగ్‌నగర్ కృష్ణాహోటల్ సెంటర్‌లోని హోచిమిన్ భవన్ వద్ద శనివారం ఘనంగా జరిగింది. సీపీఐ నగర కార్యదర్శి కేవీ భాస్కరరావు, ఏఐవైఎఫ్ డివిజన్ కార్యదర్శి పగిడిపల్లి నాగరాజు పాల్గొని భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేశారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



వృద్ధాశ్రమానికి వంట సామాన్లు, బియ్యం, సరుకులు అందిస్తున్న అసోసియేషన్ పెద్దలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): జనరల్ ఇన్సూరెన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాంబేకాలనీలోని మాతృదేవోభవ వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులు, బియ్యం, వంట సామగ్రిని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఎం.హనుమంతరావు మాట్లాడుతూ విజయవాడ బుడమేరు వరదల్లో చిక్కుకొని లక్షలమంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. తమ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు అసోసియేషన్‌లో ఉన్న 1700 మంది సభ్యుల సహకారంతో రూ.5 లక్షల విరాళాలు సేకరించినట్లు తెలిపారు. వీటిని వరద బాధితులకు అందించాలనే సంకల్పంతో పది రోజుల పాటు బాధితులను సర్వే చేసి ఆర్థికంగా చితికిపోయి, సామాన్లు కొట్టుకుపోయిన పేదలు, దివ్యాంగులు, అనాథ, వృద్ధ ఆశ్రమాలకు తమవంతు సహకారం అందిస్తున్నామన్నారు. విపత్తు వేళల్లో ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా ఆపదలో ఉన్న వారికి సహాయం చేయాలని వారు సూచించారు. అసోసియేషన్ పెద్దలు ఏఎల్ నరసింహారావు, ఎం.గిరిధర్ రెడ్డి, ఎస్.రామరావు, సెంట్రల్ కమిటీ సభ్యులు అంకయ్య, సాల్మన్‌రాజు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

'మణిపాల్' వైద్యుల వరల్డ్ హార్ట్ డే ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న మణిపాల్ హాస్పిటల్ వైద్యులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని మహానాడు వద్ద ఉన్న మణిపాల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో గుండె జబ్బులపై అవగాహన కల్పించేందుకు శనివారం వాకథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ గుండె వైద్యులు డాక్టర్ ఎస్.మురళీకృష్ణ మాట్లాడుతూ నడకతోనే మన గుండెకు దీర్ఘాయువు సాధ్యపడుతుందన్నారు. వయసుతో నిమిత్తం లేకుండా.. ప్రపంచాన్ని చుట్టుముడుతున్న గుండె సంబంధిత వ్యాధులకు శరీర శ్రమ లేకపోవడమే ప్రధాన కారణమన్నారు. అందుకే నడక, ఈత, సైక్లింగ్ తదితర శారీరక శ్రమ ద్వారా గుండెను దీర్ఘకాలం పాటు ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని చెప్పారు. క్లస్టర్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి మాట్లాడుతూ ప్రస్తుత జీవనశైలిలో చాలా మంది చిన్న వయసులోనే గుండె జబ్బులతో తమ జీవితాన్ని కోల్పోతుండడం బాధాకరమన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా మణిపాల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో గుండె జబ్బులపై అవగాహన పెంచాలనే ఉద్దేశంతో వాకథాన్ నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నర్రా సందీప్, దిలీప్ రట్టి, లక్ష్మీ నవ్య, శ్రీనివాస్‌బాబు, సమరసింహారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాహితీమూర్తులను స్మరించుకోవాలి

విజయవాడ కల్చరల్: సాహిత్యరంగంలో విశేషమైన కృషి చేసిన సాహితీ మూర్తులను స్మరించుకోవాలని విద్యావేత్త బండ్ల మాధవరావు అన్నారు. సాహితీ మిత్రులు సాహిత్యసేవా సంస్థ ఆధ్వర్యంలో విజయవాడ బుక్ ఫెస్టివల్ హాల్‌లో శనివారం కవితా, కథా రచయిత డాక్టర్ కె.ముత్యం కథా రచయిత కాశీభట్ల వేణుగోపాల్ సంస్మరణ సభను నిర్వహించారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

విజయవాడ సెంట్రల్ :
90102 01611
Office mail : sakshiads@gmail.com